# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 128 క్రిష్ణా, సోమవారం 02 - 02 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## కేంద్ర బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టుకు తగ్గిన కేటాయింపులు..





**క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 01**ఆదివారం ఉదయం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టి 2026-27 కేంద్ర ఆర్థిక బడ్జెట్‌లో ఏపీకి పెద్దగా కేటాయింపులు ఏమి జరగలేదు. కొన్ని జరిగినప్పటికీ గత ఆర్థిక బడ్జెట్‌తో పోల్చుకుంటే ఈ సారి తక్కువగానే ఉన్నాయి. పోలవరం విషయంలో చూసుకుంటే గతేడాది పోల్చుకుంటే ఈ ఏడాది ఆర్థిక బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గాయి. గత ఏడాది బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టుకు రూ. 5,936 కోట్లు కేటాయించగా ఈ సారి బడ్జెట్‌లో మాత్రం కేవలం రూ. 3,320 కోట్ల కేటాయింపులు మాత్రమే జరిగాయి.

అలాగే గత ఏడాది బడ్జెట్‌ను కేంద్ర జలశక్తిశాఖ 3,017 కోట్ల రూపాయలకు సవరించిగా పోలవరం వాటర్ స్టోరేజి లెవల్ ను 41.15 మీటర్లకు కుదించినట్లు మరోసారి వెల్లడైంది. అలాగే పోలవరం ప్రాజెక్ట్ అథారిటీకి గత ఏడాది 4.32 కోట్ల రూపాయలు కేటాయింపులు జరగ్గా ఈ సారి మాత్రం కేవలం 25 లక్షల రూపాయలు మాత్రమే కేటాయించింది.

ఇక ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర బడ్జెట్‌లో వివిధ అంతర్జాతీయ బ్యాంకుల అప్పుల ద్వారా కేటాయింపులు జరిగాయి. అమరావతి ఇంటిగ్రేటెడ్ అర్బన్ డెవలప్‌మెంట్‌ప్రాజెక్టుకు వరల్ట్ బ్యాంక్ నుంచి 432 కోట్ల రూపాయల అప్పు ఇవ్వనుంది. అలాగే ఏపీ జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ ప్రాజెక్టుకు జర్మనీ బ్యాంకు నుంచి 155 కోట్ల రూపాయల అప్పు అందనుంది. ఏపీ రోడ్ అండ్ బ్రిడ్జెస్ రీకనస్ట్రక్షన్స్ ప్రాజెక్టుకు ఎన్‌డిబి నుంచి రూ. 350 కోట్ల అప్పు.. ఏపీ రూరల్ రోడ్ ప్రాజెక్టకు ఏఐఐబి నుంచి 500 కోట్ల రూపాయల అప్పులు అందనున్నాయి.

## వికసిత్ భారత్ దిశగా బ్యాలెన్స్‌డ్ బడ్జెట్: సీఎం చంద్రబాబు





**క్రైం కౌంటర్ న్యూస్ :** చిత్తూరు, ఫిబ్రవరి 1 : 2047 వికసిత్ భారత్ దిశగా కేంద్ర ప్రభుత్వం ఇవాళ(ఆదివారం) బ్యాలెన్స్‌డ్ బడ్జెట్ ప్రవేశ పెట్టిందని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. కేంద్ర బడ్జెట్‌తో ఏపీకి కొత్త అవకాశాలు వస్తాయని వివరించారు. ఇది ఫార్వార్డ్ లుకింగ్ బడ్జెట్ అని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌ను స్వాగతిస్తున్నానని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని చెప్పుకొచ్చారు. ఆదివారం కుప్పంలో సీఎం పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు.

యువత సాధికారిత సాధించేలా బడ్జెట్..

రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిన అంశాల్లో మరింతగా దూకుడుగా వెళ్లేందుకు ఈ బడ్జెట్ సహకరించేలా ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. రాష్ట్రం అమలు చేస్తున్న ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విదానానికి ఈ బడ్జెట్ మరింత సహకరించేలా ఉందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఎంఎస్‌ఎంఈలపై ఎక్కువగా దృష్టి సారించిందని... వీటిని మరింత బలోపేతం చేసుకునే అవకాశం ఉందని వెల్లడించారు. మహిళలు, రైతులు, యువత సాధికారిత సాధించేలా బడ్జెట్ ఉందని చెప్పుకొచ్చారు. 2047 వికసిత్ భారత్ డెవలప్‌మెంట్ ఎకానమీగా మారేందుకు ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. ఆర్థిక మంత్రి బ్యాలెన్స్‌డ్ బడ్జెట్ ప్రవేశపెట్టారని ప్రశంసించారు. ఏఐతో సహా వివిధ టెక్నాలజీలు, నెక్స్ట్ లెవల్ ఆఫ్ రిఫార్మ్స్‌కు వెళ్తుందని పేర్కొన్నారు.

దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్..

రెన్యువబుల్ ఎనర్జీ, వన్ గ్రిడ్ నేషన్ దిశగా బడ్జెట్ ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. ‘స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్ రూపొందించారు. మెరుగైన జీవన ప్రమాణాలు, ఈజ్ ఆఫ్ లివింగ్ కోసం దోహదం చేసేలా బడ్జెట్ ఉంది. హైదరాబాద్-బెంగుళూరు, హైదరాబాద్ - చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్ ద్వారా రాష్ట్రానికి ఉపయోగం ఉంది. తిరుపతి, అమరావతి వంటి ప్రాంతాలు ఈ హైస్పీడ్ కారిడార్లల్లో కవర్ అవుతాయి. బెంగుళూరు - చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్ వల్ల పలమనేరు, చిత్తూరు, తదితర ప్రాంతాలు కవర్ అవుతాయి. ఈ మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లు ఏపీలోని వివిధ ప్రాంతాలను కవర్ చేస్తాయి. హైదరాబాద్, అమరావతి, బెంగుళూరు, చెన్నై లాంటి నగరాలు అన్ని అనుసంధానం అవుతాయి. డెడికేటెడ్ రేర్ ఎర్త్ కారిడార్లో ఏపీ కూడా ఉంది. అత్యంత విలువైన భార ఖనిజాలు వెలికి తీసి క్రిటికల్ ఎలక్ట్రానిక్స్ తయారీకి ఉపకరించే అవకాశం ఉంది’ అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.

టెక్స్‌టైల్ సెక్టార్‌కు ఊతం..

ఐఎస్ఎం 2.0 ద్వారా సెమీ కండక్టర్‌కు రూ.40 వేల కోట్లు పెట్టారు. టెక్స్ టైల్ సెక్టార్‌కు కూడా ఊతమిచ్చారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ’మన రాష్ట్రానికి ఈ అంశం చాలా ఉపకరిస్తుంది. పర్యాటకానికి, హాస్పిటాలిటీకి కూడా ప్రాధాన్యం ఇచ్చారు. మన రాష్ట్రంలో అరకులో టూరిజం పెరగడానికి దోహదం చేస్తుంది. కోకోనట్, జీడి, కోకో, చందనం లాంటి పంటలకు ఊతమిచ్చేలా చర్యలు ఉన్నాయి. డేటా సెంటర్లకు పన్ను మినహాయింపులు 2047 వరకూ పెట్టారు. భారత్.. డేటా సెంటర్ల హబ్‌గా తయారవుతుంది. విశాఖపట్నానికి గూగుల్‌తో సహా వివిధ డేటా సెంటర్లు వస్తున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ఊతమిచ్చేలా ఈ డేటా సెంటర్లు తయారవుతాయి. పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. లాజిస్టిక్స్ రంగానికి ఏపీ పూర్తి స్థాయిలో దృష్టి సారించింది. కేంద్ర బడ్జెట్‌లో తొలిసారిగా లాజిస్టిక్స్ రంగం అభివృద్ధి గురించి ప్రస్తావించారు’ అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## వికసిత్ భారత్ వైపు ప్రయాణాన్ని వేగవంతం చేసేలా కేంద్ర బడ్జెట్: పవన్ కల్యాణ్



**క్రైం కౌంటర్ న్యూస్ :**అమరావతి, ఫిబ్రవరి 1 ప్రధాని నరేంద్రమోదీ దార్శనిక నాయకత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం సమర్పించిన 2026-- 2027 కేంద్ర బడ్జెట్‌ను హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నానని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు. భారతదేశ ఆర్థిక పునాదులను బలోపేతం చేసే భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని.. సంస్కరణల ఆధారిత, యువత - ప్రేరేపిత బడ్జెట్‌ను సమర్పించినందుకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ని తాను హృదయపూర్వకంగా అభినందిస్తున్నానని తెలిపారు. ఈ బడ్జెట్ వికసిత్ భారత్ వైపు ప్రయాణాన్ని వేగవంతం చేస్తుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. ఉపాధి కల్పన, ఆవిష్కరణ, నగర ఆర్థిక ప్రాంతాలు, హై-స్పీడ్ రైలు కారిడార్లపై ప్రాధాన్యత ప్రాంతాలు, రంగాల్లో వృద్ధిని పున: నిర్మిస్తుందని పేర్కొన్నారు. ప్రధాన కేంద్రాలను అనుసంధానించే హై స్పీడ్ రైలు లింక్‌ల అభివృద్ధి ద్వారా.. మౌలిక సదుపాయాల కల్పనతో లాజిస్టిక్స్ ఖర్చులను తగ్గిస్తుందని చెప్పుకొచ్చారు. అలాగే స్థిరమైన రవాణాను ప్రోత్సహిస్తుందని వివరించారు.సీఎం నారా చంద్రబాబు నాయుడు సమర్థవంతమైన నాయకత్వంలో ఏపీకి అరుదైన భూమి కారిడార్లు, తూర్పు తీర పారిశ్రామిక కారిడార్, మెరుగైన ప్రజా మూలధన వ్యయం, మత్స్యకార అభివృద్ధి, తీరప్రాంత లాజిస్టిక్స్‌కు ప్రాధాన్యత ఇచ్చారని డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఏపీ వ్యాప్తంగా పెట్టుబడి వృద్ధి, పెద్దఎత్తున ఉపాధి, సమగ్ర అభివృద్ధిని సాధిస్తాయని తెలిపారు. రాష్ట్రాలకు సాధికారత కల్పించడం, మధ్యతరగతిని బలోపేతం చేయడం ద్వారా స్వావలంబనతో కూడిన భారతదేశాన్ని నిర్మించేందుకు కృషి చేస్తున్నారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## సత్యమే గెలిచింది..



**క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 01** అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో సీఎం చంద్రబాబు నాయుడుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ క్లీన్ చిట్ ఇచ్చింది. ఈ కేసులో సీఎం చంద్రబాబుకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎలాంటి సంబంధం లేదని ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది. ఈ కేసులో చంద్రబాబుకు ఈడీ క్లీన్‌చిట్ ఇవ్వడంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పందించారు. ఆయన నిష్కళంకమైన రాజకీయ ప్రస్థానానికి దక్కిన గొప్ప విజయమిదని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ‘సత్యం, న్యాయం మీద నిలబడే నాయకుడు చంద్రబాబు అని ఈ తీర్పుతో మరోసారి రుజువైంది. స్కిల్ కేసులో ఆయనకు ఎలాంటి సంబంధంలేదని ఈడీ స్పష్టం చేయడం మా అందరికీ గర్వకారణం. గత ప్రభుత్వం ఎన్ని కక్షపూరిత కుట్రలు చేసినా.. చట్టానికి గౌరవమిచ్చి ధైర్యంగా నిలిచిన నాయకత్వం ఆయనది. విజయవాడ ఏసీబీ కోర్టులో కేసు విత్‌డ్రా కావడం తప్పుడు ఆరోపణలు చేసిన వారికి చెంపపెట్టు. రాష్ట్ర భవిష్యత్తు కోసం, యువతకు ఉపాధి కల్పించాలని ఆయన తెచ్చిన స్కిల్ డెవలప్‌మెంట్ ఆలోచనను జగన్ అండ్ కో రాజకీయం చేశారు. అటు ఏపీ సీఐడీ, ఇటు ఈడీ రెండూ ఆయన పాత్రలేదని తేల్చడం చంద్రబాబు పరిపాలనా దక్షతకు నిదర్శనం. ?ఎన్ని కుట్రలు చేసినా, వ్యక్తిగత దూషణలకు దిగినా చివరికి గెలిచేది సత్యమే అని సీఎం చంద్రబాబు నిరూపించారు. రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా ఆయన నాయకత్వంలో మేమంతా ముందడుగు వేస్తాం’ అని చెప్పారు.

## ఆర్థిక వ్యవస్థకు కేంద్ర బడ్జెట్ ఊతమిస్తుందన్న మంత్రి పయ్యావుల



**క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 01** ఽంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026--27 బడ్జెట్, దేశాన్ని స్థిరమైన, బలమైన ఆర్థిక శక్తిగా ముందుకు నడిపిస్తుందని ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. దేశ ఆర్థిక పురోగతికి బాటలు వేసే బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ప్రధాని నరేంద్ర మోదీ, తొమ్మిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆయన అభినందనలు తెలిపారు. ఈ బడ్జెట్ పారిశ్రామిక రంగానికి ఊతమిస్తూ, పేద, మధ్యతరగతి వర్గాల అభ్యున్నతికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. మొత్తమ్మీద, ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించేలా కేంద్ర బడ్జెట్ ఉందని కితాబిచ్చారు.ఈ బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు మేలు చేసే పలు కీలక ప్రకటనలు ఉన్నాయని మంత్రి వివరించారు. ముఖ్యంగా హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై, బెంగళూరు-చెన్నై నగరాలను కలిపే మూడు హైస్పీడ్ రైలు కారిడార్ల ద్వారా రాష్ట్రం ఆర్థికంగా లబ్ధి పొందుతుందని చెప్పారు. అలాగే, రూ.40,000 కోట్లతో ఇంటిగ్రల్ సెమీకండక్టర్ మిషన్ 2.0 పథకాన్ని విస్తరించడం ద్వారా రాష్ట్రానికి కూడా మేలు జరుగుతుందని అన్నారు. వస్త్ర పరిశ్రమ కోసం టెక్స్‌టైల్ క్లస్టర్ల ఏర్పాటు, 2047 వరకు డేటా సెంటర్లకు పన్ను మినహాయింపులు వంటి నిర్ణయాలు ఉపాధి కల్పనను ప్రోత్సహిస్తాయని తెలిపారు.కేంద్ర బడ్జెట్‌లో కొబ్బరి, కోకో, జీడిపప్పు వంటి వాణిజ్య పంటలకు ప్రోత్సాహం ఇవ్వడం రాష్ట్ర రైతులకు పెద్ద ఊరట అని పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఈ నిర్ణయం రాష్ట్రంలోని రైతుల ఆదాయం పెరగడానికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌తో సహా ఐదు రాష్ట్రాల్లో రేర్ ఎర్త్ మినరల్స్ అన్వేషణ పథకం కూడా రాష్ట్రానికి మేలు చేస్తుందని అన్నారు. పూర్వోదయ పథకం కింద భవిష్యత్తులో రాష్ట్రానికి మరిన్ని ప్రయోజనాలు దక్కుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# టెక్నాలజీ పరిశ్రమలు పర్యాటక రంగాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యత లభించిందన్న సీఎం




**క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 01**కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రూపొందించిన 'ఫార్వర్డ్ లుకింగ్ బడ్జెట్' అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసించారు. ఈ బడ్జెట్‌ను మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నానని, ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు అభినందనలు తెలియజేస్తున్నానని ఆయన అన్నారు. కుప్పంలో ఆయన కేంద్ర బడ్జెట్‌పై స్పందిస్తూ, ఈ బడ్జెట్ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఉందని, అభివృద్ధి ప్రణాళికలను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానానికి ఈ బడ్జెట్ మరింత ఊతమిస్తుందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఎంఎస్ఎంఈల బలోపేతానికి తాము ఇస్తున్న ప్రాధాన్యతకు అనుగుణంగా కేంద్రం 75 శాతం క్రెడిట్ గ్యారెంటీ ఇవ్వడం, రాష్ట్రం తరఫున మరో 20 శాతం అందిస్తుండటంతో ఈ రంగానికి భరోసా లభిస్తుందని తెలిపారు. మహిళలు, రైతులు, యువత సాధికారత సాధించేలా ఈ బడ్జెట్ ఉందని, ఇది 2047 నాటికి భారతదేశాన్ని 'వికసిత్ భారత్'గా, అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు బలమైన పునాది వేస్తుందని అన్నారు. ఆర్థిక మంత్రి సమతుల్య బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని, దేశానికి సరైన దిశానిర్దేశం చేసేలా ఉందని కొనియాడారు.ఈ బడ్జెట్‌లో ప్రకటించిన మూడు కీలకమైన హైస్పీడ్ రైల్ కారిడార్లు హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–చెన్నై, బెంగళూరు–చెన్నై ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో ప్రయోజనం చేకూరుస్తాయని ముఖ్యమంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా అమరావతి, తిరుపతి, పలమనేరు, చిత్తూరు వంటి కీలక ప్రాంతాలు అనుసంధానమవుతాయని తెలిపారు. అలాగే, రాష్ట్రంలో ఉన్న 'రేర్ ఎర్త్ కారిడార్' ద్వారా విలువైన ఖనిజాలను వెలికితీసి, క్రిటికల్ ఎలక్ట్రానిక్స్ తయారీకి మార్గం సుగమం అవుతుందన్నారు. ఐఎస్ఎం 2.0 కింద సెమీకండక్టర్ల కోసం రూ.40 వేల కోట్లు, టెక్స్‌టైల్ రంగానికి ప్రోత్సాహకాలు ఇవ్వడం రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు.డేటా సెంటర్లకు 2047 వరకు పన్ను మినహాయింపులు ఇవ్వడం ఒక చారిత్రక నిర్ణయమని చంద్రబాబు అన్నారు. దీనివల్ల భారత్ గ్లోబల్ డేటా హబ్‌గా మారుతుందని, ఇప్పటికే విశాఖకు గూగుల్ వంటి సంస్థలు వస్తున్నాయని గుర్తుచేశారు. ఈ డేటా సెంటర్లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అభివృద్ధికి ఊతమిచ్చి, భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలో బిల్ గేట్స్ కూడా అమరావతిలో పర్యటించనున్నారని, ఏఐ, క్వాంటం కంప్యూటింగ్ వంటి నెక్స్ట్ జెన్ టెక్నాలజీలకు ఏపీ చిరునామాగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు.కేంద్ర బడ్జెట్‌లో అరకు ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసే అంశాన్ని చేర్చడం హర్షణీయమని సీఎం అన్నారు. దీంతోపాటు పులికాట్ సరస్సు అభివృద్ధికి నిధులు కేటాయించడం వల్ల ఫ్లెమింగో వంటి అరుదైన పక్షుల సంరక్షణకు, పర్యాటక వృద్ధికి దోహదపడుతుందన్నారు. ఈస్ట్ కోస్ట్ కారిడార్, అంతర్గత జలరవాణాకు నిధులు కేటాయించడం ద్వారా రాష్ట్రంలోని వెయ్యి కిలోమీటర్ల తీర ప్రాంతం లాజిస్టిక్స్ పరంగా గణనీయమైన అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. కొబ్బరి, జీడి, కోకో, చందనం వంటి ఉద్యాన పంటలకు ప్రోత్సాహం ఇవ్వడం ద్వారా రాయలసీమను ప్రపంచంలోనే అత్యుత్తమ హార్టికల్చర్ క్లస్టర్‌గా తీర్చిదిద్దుతామని, 'పూర్వోదయ' పథకం నిధులు ఇందుకు దోహదపడతాయని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'సంజీవని' ప్రాజెక్టు ఈ ఏడాది గేమ్ ఛేంజర్‌గా మారుతుందని, ఇది బయోసైన్స్‌లో విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతుందని చంద్రబాబు తెలిపారు. 2019–24 మధ్య వారసత్వంగా వచ్చిన సమస్యలను పరిష్కరించుకుంటూ, కేంద్ర బడ్జెట్ అందించిన అవకాశాలను అందిపుచ్చుకుని రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

# గీతంపై జగన్ దుష్ప్రచారం చేస్తున్నారు.. ఎంపీ భరత్ ధ్వజం

**క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 01** విశాఖపట్నంలోని గీతం యూనివర్సిటీ భూముల వ్యవహారంపై వస్తున్న విమర్శలను ఆ సంస్థ ప్రెసిడెంట్, ఎంపీ భరత్ తీవ్రంగా ఖండించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కావాలనే గీతంపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో రాజకీయ కక్షలతోనే యూనివర్సిటీ ప్రహరీ గోడను అక్రమంగా కూల్చివేశారని, ఇప్పుడు కూడా అవాస్తవాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని భరత్ విమర్శించారు. భూముల విలువలపై జరుగుతున్న ప్రచారాన్ని భరత్ గణాంకాలతో సహా తిప్పికొట్టారు. 2024 నాటి రిజిస్ట్రేషన్ ధరల ప్రకారం 54.79 ఎకరాల భూమి విలువ సుమారు 1000 కోట్ల రూపాయలు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అయితే కేవలం ఏడాది కాలంలోనే ఈ భూమి ధర ఐదు రెట్లు పెరిగిందని చెప్పడం ఏమాత్రం హేతుబద్ధం కాదని ఆయన పేర్కొన్నారు. మార్కెట్ ధరలు మరియు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జగన్ మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.యూనివర్సిటీకి సంబంధించిన భూముల విషయంలో ప్రభుత్వం నిర్ణయించే ధరకు తాము కట్టుబడి ఉన్నామని భరత్ కీలక ప్రకటన చేశారు. చట్ట ప్రకారం ప్రభుత్వం ఎంత ధర నిర్ణయించినా ఆ మొత్తాన్ని చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికే ఇప్పుడు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, తాము ఎప్పుడూ నిబంధనలకు లోబడే



వ్యవహరిస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

ఇదే క్రమంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ కేటాయింపులపై భరత్ ఎదురుదాడికి దిగారు. సుమారు 1100 కోట్ల రూపాయల విలువ చేసే 11 ఎకరాల భూమిని టి.ఎస్.ఐ.బి కి కేవలం 11 కోట్ల రూపాయలకే జగన్ ప్రభుత్వం ఎలా ఇచ్చిందో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. విలువైన భూములను నామమాత్రపు ధరలకే కట్టబెట్టిన వారు, ఇప్పుడు గీతం సంస్థపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు.

# వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి ఈడీ నోటీసులు జారీ





**క్రైం కౌంటర్ న్యూస్ :** అమరావతి, జనవరి 19: ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్‌లో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి ఈడీ నోటీసులు జారీ చేసింది. జనవరి 23న వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావాలంటూ ఎంపీ మిథున్ రెడ్డికి జారీ చేసిన నోటీసుల్లో ఈడీ స్పష్టం చేసింది. ఈ లిక్కర్ స్కామ్‌లో ఆయన కీలక పాత్ర పోషించారని ఈడీ అనుమానిస్తోంది. అలాగే ఈ వ్యవహారంలో హవాలా, మనీ ల్యాండరింగ్ రూపంలో భారీఎత్తున అక్రమాలు జరిగినట్లు ఈడీ అనుమానిస్తోంది. ఈ నేపథ్యంలో వైసీపీ ఎంపీకి నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే ఈ కేసులో మిథున్ రెడ్డి అరెస్టయ్యారు. అనంతరం ఆయన్ని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. ప్రస్తుతం ఆయన బెయిల్‌పై విడుదలైన విషయం విదితమే.మరోవైపు వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డికి సైతం రెండ్రోజుల క్రితం ఈడీ నోటీసులు జారీ చేసింది. జనవరి 22వ తేదీన విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. వైసీపీ పభుత్వ హయాంలో జరిగిన లిక్కర్ స్కామ్‌పై జరిగిన విచారణలో ఇప్పటికే పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ స్కామ్ లో కీలక పాత్ర పోషించిన రాజ్ కసిరెడ్డి ఆస్తులను సైతం ప్రభుత్వానికి అటాచ్ చేశారు. అలాగే ఈ కేసులో విశ్రాంత ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పలను అరెస్ట్ చేశారు.

ప్రస్తుతం వారు బెయిల్‌పై బయట ఉన్నారు. ఈ స్కామ్‌లో తవ్వే కొద్ది కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అంతేకాకుండా.. ఎంపీ మిథున్ రెడ్డి ఈ కేసులో కీలక పాత్ర పోషించారనే ప్రచారం సాగుతోంది. దాంతో విచారణకు హాజరుకావాలంటూ ఆయనకు నోటీసులు జారీ చేసింది. ఆ ముందు రోజే విచారణకు హాజరు కావాలంటూ విజయసాయిరెడ్డికి ఈడీ నోటీసులు ఇచ్చింది. అయితే వైసీపీతోపాటు రాజ్యసభ సభ్యత్వానికి విజయసాయిరెడ్డి రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

# టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌పై బదిలీ వేటు

**క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 01** తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి అనిల్ కుమార్ సింఘాల్ బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నేడు ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్న ముద్దాడ రవిచంద్రకు టీటీడీ ఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. అనిల్ కుమార్ సింఘాల్‌ను తక్షణమే సాధారణ పరిపాలన విభాగం లో రిపోర్టు చేయాలని ఆదేశించింది.1993 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అనిల్ కుమార్ సింఘాల్, 2017 మే నుంచి 2020 అక్టోబర్ వరకు తొలిసారి టీటీడీ ఈవోగా సేవలందించారు. అనంతరం గతేడాది సెప్టెంబరులో రెండోసారి ఈ పదవిని చేపట్టారు. కేవలం ఐదు నెలల కాలంలోనే ఆయన బదిలీ కావడం టీటీడీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కాగా, తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడకంపై సిట్ నివేదిక వచ్చిన కొన్ని రోజుల్లోనే ఈ బదిలీ జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది.



# ఇక ధర్మ'వరమే'...!

**ఇరవై ఏళ్ల తర్వాత గ్రామ సమ్మర్ స్టోరేజీకి మోక్షం**

**ట్యాంక్ పునర్నిర్మాణానికి రూ.5.70 కోట్లు విడుదల**

**మంత్రి రవికుమార్ ప్రత్యేక చొరవతో నిధుల మంజూరు**

**త్వరలో ప్రారంభం కానున్న పనులు**

**12 గ్రామాలకు తాగునీటి సరఫరాకు అవకాశం**



**క్రైం కౌంటర్ న్యూస్ :** అద్దంకి, ఫిబ్రవరి 1 : రెండు దశాబ్దాల క్రితం నిర్మించారు.. ప్రజలకు గుక్కెడు నీటిని అందించలేకపోయారు. దీంతో నేటికీ నిరుపయోగంగా ఉండిపోయింది. ఈ నేపథ్యంలో విద్యుత్ శాఖ మంత్రి, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఆ ప్రాజెక్ట్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. ధర్మవరం సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ పునర్నిర్మాణానికి రూ.5.70 కోట్లు నిధులు మంజూరు చేయించారు. వివరాల్లోకెళ్తే...

అద్దంకి మండలం ధర్మవరం గ్రామ పెద్ద చెరువులో కొంత భాగాన్ని సమ్మర్‌స్టోరేజీ ట్యాంక్‌గా మార్పుచేసి అద్దంకి మేజర్ కాలువ నుంచి నీటిని పంపింగ్ చేసేవిధంగా ఏర్పాటుచేశారు. నీటి పంపింగ్ సామర్థ్యం తక్కువగా ఉండటం, స్టోరేజీ ట్యాంక్‌లోకి పంపింగ్ చేసిన నీరు ఇట్టే ఇంకిపోతుండటంతో కొద్దికాలానికే ఆ పథకం మూలన పడింది. మండలంలోని ధర్మవరం, శంఖవరప్పాడు, కలవకూరు, శింగరకొండపాలెం, గోపాలపురం, చక్రాయపాలెం, శాంతినగర్, చినకొత్తపల్లి, శ్రీనివాసనగర్, సాధునగర్, గోవాడ, కొత్తరెడ్డిపాలెం తదితర గ్రామాలలో ఏర్పాటు చేసిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నుంచి నీటి సరఫరా జరగాల్సి ఉంది. సమ్మర్‌స్టోరేజీ ట్యాంక్‌లో నీరు నిల్వ ఉండకపోవటంతో పథకం నీరుగారిపోయింది. దీంతో ఆయా గ్రామాలకు ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌లు, కొన్ని గ్రామాలలో ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు నిరుపయోగంగా మారాయి. అదే సమయంలో కొన్నిచోట్ల ధ్వంసమయ్యాయి. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రి రవికుమార్ ధర్మవరం సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ పునర్నిర్మాణంపై దృష్టి సారించి రూ.5.70 కోట్లు మంజూరు చేయించారు. ఇప్పటికే టెండర్లు కూడా పూర్తయ్యాయి. త్వరలో పనులు ప్రారంభించనున్నారు. పనులన్నీ పూర్తయితే 12 గ్రామాలకు సాగర్ నీరు సరఫరా చేసే అవకాశం ఏర్పడుతుంది.పనులు చేసేది ఇలా...

సమ్మర్‌స్టోరేజీ ట్యాంక్ అడుగున ఉన్న లూజ్ సాయిల్ తవ్విబయటకు తరలించి, దాని స్థానంలో నీరు ఇంకకుండా ఉండే విధంగా బ్లాక్ సాయిల్ తోలి రోలింగ్ చేయనున్నారు.అద్దంకి మేజర్ కాలువ నుంచి తక్కువ రోజులలో సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌కు ఎక్కువ నీటిని సరఫరా చేసేందుకు వీలుగా ఎక్కువ సామర్థ్యం మోటార్లు ఏర్పాటు చేయనున్నారు.

ధర్మవరంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్‌లు ఇచ్చేవిధంగా అంతర్గత పైప్‌లైన్‌లు ఏర్పాటు చేయనున్నారు.

మిగిలినచోట్ల ఆయా గ్రామాలకు కేటాయించిన నిధులతో అంతర్గత పైప్‌లైన్‌లు, ఇంటింటికీ కుళాయి పనులు జరగనున్నాయి.

# జోగి రమేశ్ నివాసానికి నిప్పు పెట్టి ఫ్లెక్సీలను తగులబెట్టిన ఆందోళనకారులు



**క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 01**విజయవాడ సమీపంలోని కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్ నివాసాన్ని తెలుగుదేశం పార్టీ శ్రేణులు ముట్టడించాయి. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా భయానక వాతావరణం ఏర్పడింది.టీడీపీ అధినేత చంద్రబాబు, నారా లోకేశ్‌పై జోగి రమేశ్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ టీడీపీ కార్యకర్తలు భారీ సంఖ్యలో ఆయన నివాసానికి చేరుకున్నారు. తొలుత ఇంటిపై రాళ్లతో దాడి చేసి, ఆ తర్వాత ఇంటికి నిప్పుపెట్టారు. ఇంటి చుట్టూ ఉన్న వైసీపీ ఫ్లెక్సీలను కూడా దగ్ధం చేశారు. దాడి సమయంలో జోగి రమేశ్ ఇంట్లో లేరు. ఈ ఘటనలో ఇంటి మొదట అంతస్తులో మంటలు ఎగిసిపడ్డాయి.సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తుండగా, పోలీసులు భారీగా మోహరించి పరిస్థితిని శాంతింపజేసేందుకు చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ దాడిలో ఎవరికీ గాయాలు కాలేదని, అయితే ఇంటికి మాత్రం తీవ్ర నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

# సేవ చేయాలన్నదే సంకల్పం



క్రైం కౌంటర్ న్యూస్ : ఎచ్చెర్ల, ఫిబ్రవరి 1 ప్రజలకు నేరుగా సేవ చే యాలన్న ధృఢ సంకల్పంతో చదివి అనుకున్న లక్ష్యం సాధించి నట్లు గ్రూపు-1 విజేత సంపతిరావు శివ నాగగౌరి తెలిపారు. డీఎస్పీగా ఎంపికైన ఆమె తన భావాలను ఆదివారం 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. ఆమె మాటల్లోనే..

మునసబుపేటలోని గాయత్రి పాఠశాలలో పదో తరగతి వరకు, విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్, బీటెక్ (సివిల్) వీఐటీ ఇంజనీరింగ్ కళాశాల (వెల్లూరు, తమిళనాడు)లో చది వాను. అమ్మనాన్నలకు ఇద్దరు సంతానం. ఇందులో నేను పెద్దమ్మాయిని. నాన్న ఓ ప్రైవేటు కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. నాన్న వాళ్ల అన్నదమ్ములంతా ప్రభుత్వ ఉద్యోగులే. నాన్న తనకు ఉన్న భూమిని అమ్మేసి మమ్మల్ని చదివించారు.

ఒకేసారి ఆరు ఉద్యోగాలు..

వెల్లూరు వీఐటీ కళాశాలలో ఇంజనీరింగ్ పూర్తయిన వెంటనే ఒకేసారి ఆరు ఉద్యోగాలు వచ్చాయి. ఐదు సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో, ఒకటి ఆర్కిడిస్ (బెంగళూరు)లో ఉద్యోగాలు వచ్చాయి. గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (జీఏఐఎల్)కు కూడా ఎంపికయ్యాను. తన చదువుకు సంబంధం ఉన్న ఆర్కిడిస్‌లో ఉద్యోగాన్నే ఎంచుకుని ఏడాది పాటు పనిచేశాను. ప్రభుత్వ రంగంలో ఉద్యోగం చేయాలన్న లక్ష్యంతో 2016-17లో ఆర్కిడిస్‌లో ఉద్యోగం మానేశాను. ఆ తర్వాత 2017లో ఇరిగేషన్ శాఖలో ఏఈఈగా ఎంపికయ్యాను. శ్రీకాకుళంలోని వంశధార ప్రాజెక్ట్‌లో డెప్యూటేషన్‌పై ఏఈఈగా విధులు నిర్వర్తిస్తున్నాను. ప్రజలతో నేరుగా సంబంధంలేని ఉద్యోగం కావడంతో ఏదో తెలియని వెలితి మాత్రం మనసులో ఉండేది. ఈ క్రమంలో గ్రూపు-1 రాసి డీఎస్పీగా ఎంపికయ్యాను.

వాట్సాప్ గ్రూపుగా ఏర్పడి..

మెయిన్స్ ప్రిపరేషన్ కోసం ఉద్యోగానికి రెండు నెలలు సెలవు పెట్టాను. ప్రిలిమినరీ అయిన తర్వాత మెయిన్స్ కోసం నెల్లూరు, గుంటూరుకు చెందిన ఇద్దరు మహిళలతో ఓ వాట్సాప్ గ్రూపు క్రియేట్ చేశాం. ప్రతి రోజూ 8 నుంచి 10గంటల పాటు ఆన్‌లైన్‌లోనే మేము ప్రిపేరయ్యేవాళ్లం. ముఖ్యమైన అంశాలను చర్చించుకోవడం, ప్రతి కీలకాంశాన్ని ఒకటికి పదిసార్లు మరిచిపోకుండా రిపీట్ చేసేవాళ్లం.

కుటుంబ నేపథ్యం..ఎస్ఎం పురం గ్రామానికి చెందిన సంపతిరావు రామకృష్ణరాజు, లక్ష్మి దంపతుల పెద్ద కుమార్తె శివ నాగగౌరి. ఆమెకు అదే గ్రామానికి చెందిన చౌదరి అవినాష్‌తో 2017లో వివాహమైంది. భర్త అవినాష్ శ్రీకాకుళం డీసీఎంఎస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. మామయ్య చౌదరి నారాయణమూర్తి (బాబ్జీ) టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా, అత్త చౌదరి ధనలక్ష్మి జడ్పీ చైర్‌పర్సన్‌గా గతంలో పనిచేశారు. నాగగౌరి, అవినాష్ దంపతులకు 2018లో బాబు, 2019లో ఓ పాప జన్మించారు. భర్త, తల్లిదండ్రులు, అత్త మామల అందరి సహకారంతో విజయం సాధించినట్టు ఆమె తెలిపారు.

# కేంద్ర బడ్జెట్ 2026: ఏపీ అభివృద్ధికి సరికొత్త బాటలు



క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 01 కేంద్ర బడ్జెట్ దేశాభివృద్ధికి దిక్సూచిగా నిలిచిందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కొనియాడారు. మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్య, ఆరోగ్యం, వ్యవసాయం మరియు యువత సంక్షేమానికి ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేశారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా విదేశీ యాత్రలపై పన్నులను తగ్గించడం ద్వారా విమానయాన రంగానికి నూతన ఉత్తేజం లభిస్తుందని, ఇది పర్యాటక రంగాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఈ బడ్జెట్ అత్యంత కీలకమని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రానికి గణనీయమైన ప్రయోజనాలు చేకూరేలా కేంద్రం కేటాయింపులు చేసిందని ఆయన తెలిపారు. హైస్పీడ్ రైలు అనుసంధానం ద్వారా రవాణా వ్యవస్థ మెరుగుపడుతుందని, ఇది రాష్ట్ర ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని వివరించారు. పరిశ్రమల స్థాపన మరియు సాంకేతిక అభివృద్ధికి ఈ బడ్జెట్ ఊతమిస్తుందని లోకేశ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో క్రిటికల్ మినరల్స్ కారిడార్ ఏర్పాటుతో పాటు, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగానికి ఇచ్చే ప్రోత్సాహకాలు పెట్టుబడులను ఆకర్షించడంలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ఈ రంగాలు ప్రధాన భూమిక పోషిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.మొత్తంగా, కేంద్ర బడ్జెట్ అటు దేశాభివృద్ధిని, ఇటు రాష్ట్ర ప్రయోజనాలను సమతూకం చేస్తూ రూపొందించబడిందని ఇద్దరు నేతలు స్పష్టం చేశారు. మౌలిక సదుపాయాల పటిష్టత మరియు వినూత్న పారిశ్రామిక కారిడార్ల ద్వారా ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రం మారబోతోందని, ఈ బడ్జెట్ కేటాయింపులు రాష్ట్ర పునర్నిర్మాణానికి ఎంతో తోడ్పడతాయని వారు వెల్లడించారు.

# చరిత్రలో లేని మెజార్టీ కూటమికే దక్కింది: సీఎం చంద్రబాబు



క్రైం కౌంటర్ న్యూస్ :చిత్తూరు, ఫిబ్రవరి 1 : గతంలోనూ, ఇప్పుడు కుప్పంలో తాను ప్రారంభించిన కార్యక్రమాలనే ఏపీ వ్యాప్తంగా అమలు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. కుప్పంలో సీఎం పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం టీడీపీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై కేడర్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా, సంక్షోభాలు వచ్చినా టీడీపీ కాబట్టే నిలదొక్కుకోగలిగిందని తెలిపారు. చరిత్రలో ఎప్పుడూ రానంత మెజార్టీ కూటమికి, టీడీపీకి వచ్చిందని ప్రస్తావించారు. వైసీపీ ప్రతిపక్ష హోదాకు దరిదాపుల్లోకి కూడా రాలేకపోయిందన్నారు.

అభివృద్ధికి పునాదులు వేసింది టీడీపీనే..

ప్రజలతో ఉంటే ఇలాంటి గెలుపు సాధ్యమవుతుందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. 2028 నాటికి తన రాజకీయ జీవితం 50 ఏళ్లకు చేరుతుందని చెప్పుకొచ్చారు. అభివృద్ధికి పునాదులు వేసింది.. వేసేది టీడీపీనేనని.. విజన్-2020తో ఇది నిరూపితమైందని వెల్లడించారు. ప్రజల భవిష్యత్, ప్రజల సంక్షేమం కోసమే తన ఆలోచనలని తెలిపారు. భారతదేశానికి అమరావతి లాంటి కొత్త నగరాలు అవసరమని ఆర్థిక సర్వేలో చెప్పారని అన్నారు. రాయలసీమను రతనాల సీమ చేస్తామని చెప్పామని.. చేసి చూపించామని అన్నారు. దేశంలోనే ఉద్యాన ఉత్పత్తులకు రాయలసీమ మొదటి స్థానంలో ఉందని వెల్లడించారు. రాయలసీమలో ఉద్యాన రంగం అభివద్ధి.. రాయలసీమలో ఉద్యాన రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తామని సీఎం చంద్రబాబు మాటిచ్చారు. ఎమ్మెల్యేల పని తీరు ప్రతి వారం విశ్లేషిస్తూనే ఉన్నానని తెలిపారు. కార్యకర్తలకు, తనకు కమ్యూనికేషన్ గ్యాప్ రాకుండా ఉండేందుకు పార్టీలో కూడా టెక్నాలజీని వినియోగిస్తున్నామని వివరించారు. సంక్షేమం తెస్తామని ఇంటింటికీ వెళ్లి చెప్పామని... ఆ సంక్షేమాన్ని అమలు చేస్తున్నప్పుడు కూడా ఇంటింటికీ వెళ్లాలని సూచించారు. కూటమిలోని పార్టీలతో కలిసి పని చేయాలని కేడర్‌కు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

# పలాస జీడికి 'గ్లోబల్' కిక్! ఉద్దానం కొబ్బరికి 'రీ-ప్లాంటేషన్' దన్ను

**తీరప్రాంత ఇసుకలో 'రేర్ ఎర్త్' మెరుపులు**

**అంతర్జాతీయ జలాల్లో వేటకు పన్ను మినహాయింపు..**

**జూట్ మిల్లులకు 'నేషనల్ ఫైబర్' ఊపిరి..**

**పైడిభీమవరానికి 'బయో' బూస్ట్**

**ఊరటనిచ్చేలా కేంద్రబడ్జెట్**



క్రైం కౌంటర్ న్యూస్ : శ్రీకాకుళం, ఫిబ్రవరి 1 : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్.. వెనుకబడిన శ్రీకాకుళం జిల్లా ముఖచిత్రాన్ని మార్చే దిశగా ఆశలు రేకెత్తించింది. జిల్లా పేరును నేరుగా ప్రస్తావించకపోయినా.. ఇక్కడి జీవనాడి అయిన జీడి, కొబ్బరి, మత్స్య రంగాలకు, భవిష్యత్ వనరులైన ఖనిజాలకు బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. 'రేర్ ఎర్త్' కారిడార్ ప్రకటన జిల్లా పారిశ్రామిక ప్రగతికి సరికొత్త బాటలు వేయనుంది. జిల్లా ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకైన జీడి పరిశ్రమకు ఈ బడ్జెట్ స్వర్ణయుగాన్ని సూచిస్తోంది. 2030 నాటికి భారతీయ జీడిపప్పును 'ప్రీమియం గ్లోబల్ బ్రాండ్' గా తీర్చిదిద్దేందుకు కేంద్రం కంకణం కట్టుకుంది. ముడి జీడిపప్పు ఉత్పత్తిలో స్వయం సమృద్ధికి ప్రత్యేక మిషన్ ప్రకటించింది. ఇది పలాస, మందస, వజ్రపుకొత్తూరు రైతులకు, ప్రాసెసింగ్ యూనిట్లకు శుభవార్త. విదేశీ ముడిసరుకు(ఆర్‌సీఎన్) దిగుమతి కష్టాలు తీరడమే కాకుండా, అంతర్జాతీయ మార్కెట్‌లో పలాస జీడికి ప్రత్యేక గుర్తింపు లభించి ధరలు పెరిగే అవకాశముంది.

ఉద్దానం కొబ్బరికి 'పునరుజ్జీవం'

తుఫాన్లు, చీడపీడలు, వృద్ధాప్యంతో సతమతమవుతున్న ఉద్దానం కొబ్బరి రైతులకు ఈ బడ్జెట్ భరోసా ఇచ్చింది. 'కొబ్బరి ప్రోత్సాహక పథకం' కింద.. పాత, దిగుబడి రాని చెట్ల స్థానంలో కొత్త హైబ్రిడ్ మొక్కలు నాటడానికి భారీ నిధులు కేటాయించారు. కవిటి, ఇచ్చాపురం, సోంపేట మండలాల్లోని రైతులు తమ తోటలను పునరుద్ధరించుకోవడానికి ఇది గొప్ప అవకాశం. కొత్త రకం మొక్కలతో దిగుబడి, ఆదాయం రెండూ పెరుగుతాయి.

తీరప్రాంతంలో 'సిరి' మెరుపులు

జిల్లాలోని 193 కిలోమీటర్ల తీరప్రాంతం అపారమైన ఖనిజ సంపదకు నిలయం. అరుదైన ఖనిజాల(రేర్ ఎర్త్) వెలికితీత, శుద్ధి కోసం రాష్ట్రంలో 'డెడికేటెడ్ రేర్ ఎర్త్ కారిడార్' ఏర్పాటు చేయనున్నారు. తీరంలోని మోనజైట్, ఇల్మినైట్, గార్నెట్ వంటి ఖనిజాల ఆధారిత పరిశ్రమలు జిల్లాకు తరలివచ్చే అవకాశం ఉంది. స్థానిక యువతకు భారీగా ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

మత్స్యకారులకు లాభాలు..

మత్స్యకారుల సంక్షేమానికి బడ్జెట్ రెండు ప్రధాన వరాలు ప్రకటించింది. భారతీయ నౌకలు అంతర్జాతీయ జలాల్లో (హై సీస్) వేటాడే చేపలపై దిగుమతి సుంకాన్ని పూర్తిగా ఎత్తివేశారు. ఇది డీప్‌సీ ఫిషింగ్ చేసే బోటు యజమానులకు భారీ ఊరట. రొయ్యలు, చేపల ప్రాసెసింగ్‌లో వాడే ముడిసరుకుల దిగుమది సుంకం మినహాయింపు పరిమితిని ఒక శాతం నుంచి 3 శాతానికి పెంచారు. ఇది జిల్లాలో ఆక్వా పరిశ్రమలకు లాభదాయకం.

జూట్-ఫార్మా పరిశ్రమలకు ఊతం..

రాజాం(ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా), ఆమదాలవలస ప్రాంతాల్లో మూతపడే దశలో ఉన్న జూట్ మిల్లులకు 'నేషనల్ ఫైబర్ మిషన్' ద్వారా నిధులొచ్చే వీలుంది. ఇది మిల్లుల ఆధునికీకరణకు, కార్మికుల భద్రతకు దోహదపడుతుంది. రూ.10,000 కోట్లతో ప్రకటించిన 'బయోఫార్మా శక్తి' పథకం... జిల్లాలోని పైడిభీమవరం ఫార్మా క్లస్టర్ విస్తరణకు దోహదపడనుంది.

పొందూరు ఖాదీకి పూర్వ వైభవం

జిల్లా ఖ్యాతిని ఖండాంతరాలకు చాటిన పొందూరు ఖాదీకి, గిరిజన ఉత్పత్తులకు బడ్జెట్‌లో చోటు దక్కింది. ఖాదీ, హస్తకళలను బలోపేతం చేయడానికి 'మహాత్మా గాంధీ గ్రామ్ స్వరాజ్' పథకాన్ని ప్రకటించారు. ఇది గ్లోబల్ మార్కెటింగ్, బ్రాండింగ్‌కు సాయపడుతుంది. ఆదరణ తగ్గుతున్న పొందూరు ఖాదీకి ఈ పథకం ద్వారా కొత్త ఊపిరి అందే అవకాశముంది. అలాగే ఏజెన్సీలలో గిరిజనులు తయారు చేసే హస్తకళా ఉత్పత్తులకు (బాంబూ క్రాఫ్ట్, సవర పెయింటింగ్స్) సరైన మార్కెటింగ్ సదుపాయం లభిస్తుంది.

మహిళలకు 'లక్షాధికారి' యోగం..

స్వయం సహాయక సంఘాల మహిళల కోసం 'షీ మార్ట్స్' ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. దీనివల్ల జిల్లాలోని డ్వాక్రా మహిళలు తాము తయారు చేసిన ఉత్పత్తులను(ఊరగాయలు, అప్పడాలు, చేతివృత్తులు) నేరుగా అమ్ముకునే వీలు కలుగుతుంది. అలాగే సైన్స్, టెక్నాలజీ (ఎస్‌టీఈఎం) కోర్సులు చదివే అమ్మాయిల కోసం ప్రతి జిల్లాలో ఒక హాస్టల్ నిర్మిస్తామని చెప్పారు. ఉన్నత చదువుల కోసం విశాఖ, విజయనగరం వెళ్లే సిక్కోలు ఆడబిడ్డలకు ఇది ఉపయోగపడుతుంది.

సిక్కోలుకు 'పూర్వోదయ' వరం!

కేంద్రం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన 'పూర్వోదయ' పథకం మన జిల్లా రైల్వే రవాణా వ్యవస్థకు జీవం పోయనుంది. ఈ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఒడిశా, పశ్చిమ బెంగాల్ వంటి తూర్పు రాష్ట్రాల సమగ్ర అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది. బడ్జెట్‌లో 'ఇంటిగ్రేటెడ్ ఈస్ట్ కోస్ట్ ఇండస్ట్రియల్ కారిడార్' అభివృద్ధిని కేంద్రం ప్రతిపాదించింది. చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి.. రైల్వే లైన్‌ను ఆనుకుని ఉండే శ్రీకాకుళం జిల్లా.. ఈ కారిడార్‌లో కీలక భాగస్వామిగా మారనుంది. అమృత్ భారత్ స్టేషన్ పనులు (శ్రీకాకుళం రోడ్, పలాస, నౌపడ), ట్రాక్ ఆధునికీకరణ, భద్రతా పరమైన పనులు శరవేగంగా పూర్తయ్యే అవకాశం ఉంది. నిరాశ పరిచిన అంశాలు.. బడ్జెట్‌లో మెరుపులున్నా.. జిల్లా చిరకాల వాంఛలకు మాత్రం గ్రహణం వీడలేదు. విశాఖ రైల్వేజోన్ పనులు, శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస రైల్వే స్టేషన్) అభివృద్ధిపై స్పష్టత లేదు. వంశధార-నాగావళి అనుసంధానానికి, వంశధార ప్రాజెక్టుకు ప్రత్యేక నిధులు కేటాయించలేదు. ఉద్దానం కిడ్నీ సమస్యపై శాశ్వత పరిష్కారానికి జాతీయ స్థాయి రీసెర్చ్ సెంటర్ ఊసే లేదు. మొత్తంగా చూస్తే ఇది సిక్కోలు 'రైతు, పారిశ్రామిక వర్గాలకు అనుకూల బడ్జెట్'. జీడి, కొబ్బరి, ఖనిజాల విషయంలో కేంద్రం ఇచ్చిన రోడ్‌మ్యాప్‌ను.. జిల్లా యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో అందిపుచ్చుకుంటే జిల్లా రూపురేఖలు మారడం ఖాయమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

'వికసిత్' పద్దుతో ప్రగతి: కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్ దేశాభివృద్ధికి దిక్సూచిలా, సామాన్యుడికి రక్షణ కవచంలా ఉందని కేంద్రపౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. తొమ్మిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టి నిర్మలమ్మ రికార్డు సృష్టించారని.. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూనే.. మౌలిక వసతులు, విద్య, వైద్యం, రైతాంగం, యువతకు పెద్దపీట వేశారని కొనియాడారు. బడ్జెట్‌పై హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలకు ఆర్థిక తోడ్పాటులో భాగంగా ఏపీకి నిధుల కేటాయింపులో సింహభాగం దక్కడంపై కేంద్రమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా అస్థిరతలు ఉన్నప్పటికీ గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ. 12.2లక్షల కోట్ల మూలధన పెట్టుబడులు పెట్టడం మోదీ సర్కార్ దార్శనికతకు నిదర్శనమన్నారు. విదేశీ పర్యటనలపై పన్ను తగ్గింపు, విమాన విడిభాగాలపై సుంకాల సవరణ నిర్ణయాల పౌర విమానయాన రంగానికి కొత్త రెక్కలు తొడుగుతాయని తెలిపారు. ఈ నిర్ణయాలు ప్రయాణికులపై భారాన్ని తగ్గించడంతోపాటు, మరిన్ని పెట్టుబడులకు, ఉపాధి కల్పనకు దోహదపడతాయన్నారు.

ఉద్దానానికి ఊతం

'శ్రీకాకుళం జిల్లా రైతాంగానికి ఈ బడ్జెట్ తీపి కబురు అందించింది. కొబ్బరి, జీడి, మామిడి సాగుకు బడ్జెట్‌లో ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించడం శుభపరిణామం. ముఖ్యంగా 'కొబ్బరి ప్రోత్సాహక పథకం' ద్వారా ఉద్దాన ప్రాంతానికి మళ్లీ పూర్వ వైభవం వస్తుంది. రైతుల కష్టాలు తీరుతాయి. ప్రతి జిల్లాలో బాలికల వసతి గృహాల ఏర్పాటు నిర్ణయం... పేద విద్యార్థుల విద్యాభ్యాసానికి గొప్ప వరం. కొత్త ఆదాయపు పన్ను చట్టం ద్వారా మధ్యతరగతి ఉద్యోగులకు, సామాన్యులకు పన్ను భారం తగ్గింది. ఏడు నగరాల మధ్య హైస్పీడ్ కారిడార్లు, టూరిజం అభివృద్ధి, డేటా సెంటర్ల ఏర్పాటు వంటి నిర్ణయాలు 'వికసిత్ భారత్' లక్ష్యసాధనను వేగవంతం చేస్తాయ'ని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట : మంత్రి అచ్చెన్న

'కేంద్ర బడ్జెట్‌లో ప్రకృతి వ్యవసాయ విస్తరణకు రూ.155.32 కోట్లు కేటాయించడం హర్షణీయం. ఈ బడ్జెట్ దేశ వ్యవసాయ రంగానికి దిశానిర్దేశం చేస్తుంది. ప్రకృతి వ్యవసాయం వల్ల భూమి సారం పెరగడంతో పాటు రైతులకు అధిక ఆదాయం సమకూరుతుంది. రిజర్వాయర్లలో చేపల పెంపకం, పశు సంవర్ధక శాఖకు ఇచ్చిన ప్రోత్సాహకాలు గ్రామీణ ఉపాధిని మెరుగుపరుస్తాయి. కొబ్బరి ఉత్పత్తి పెంపునకు, పాత చెట్ల స్థానంలో కొత్త వాటిని నాటేందుకు కేంద్రం ప్రకటించిన సాయం తోటల ఉత్పాదకతను పెంచుతుంది. ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతో వ్యవసాయ రంగం మరింత బలోపేతం అవుతుంది. రైతు సంక్షేమమే ధ్యేయంగా బడ్జెట్ రూపకల్పన చేసినందుకు కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్‌కు ధన్యవాదాలు' అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.

# సినిమా



## నటసింహం పక్కన సూపర్ స్టార్.

తెలుగు చిత్ర పరిశ్రమ చరిత్రలో కొన్ని కాంబినేషన్లు వింటేనే ఒళ్లు పులకరిస్తుంది. ఒకరు మాస్ మంత్రానికి కేరాఫ్ అడ్రస్, మరొకరు గ్లామర్ అండ్ పర్ఫార్మెన్స్‌కు కేరాఫ్ అడ్రస్. ఆ ఇద్దరు అగ్ర హీరోలు ఒకే ఫ్రేమ్‌లో కనిపిస్తే థియేటర్లు దద్దరిల్లిపోవడం ఖాయం. సీనియర్ హీరో ఎన్టీఆర్, ఏఎన్నార్ కాలం నుంచి నేటి తరం రామ్ చరణ్, జూనియర్ ఎన్టీఆర్ వరకు ఎన్నో క్రేజీ మల్టీస్టారర్ సినిమాలు బాక్సాఫీస్‌ను షేక్ చేశాయి. అయితే మనకు తెలియని విషయం ఏంటంటే.. ఒక స్టార్ డైరెక్టర్ తెలుగు తెరపై ఒక అద్భుతాన్ని ఆవిష్కరించాలని చూశారు. నటసింహాన్ని, సూపర్ స్టార్‌ని అన్నదమ్ములుగా చూపిస్తూ ఒక భారీ యాక్షన్ ఫ్యామిలీ డ్రామాను ప్లాన్ చేశారు. ఆ సినిమా గనుక పట్టాలెక్కి ఉంటే టాలీవుడ్ రికార్డులన్నీ గాలిలో కలిసిపోయేవి. ఇంతకీ ఆ క్రేజీ కాంబినేషన్‌ను సెట్ చేయాలని చూసిన ఆ దర్శకుడు ఎవరు? ఆ భారీ ప్రాజెక్ట్ ఎందుకు ఆగిపోయిందో తెలుసుకుందాం..

బ్లాక్ బస్టర్ కాంబో..

నందమూరి బాలకృష్ణ మాస్ ఇమేజ్‌ను శిఖరాగ్రానికి చేర్చిన దర్శకుల్లో బి.గోపాల్ పేరు ముందు వరుసలో ఉంటుంది. వీరిద్దరి కలయికలో వచ్చిన సినిమాలు టాలీవుడ్ ట్రెండ్‌ను మార్చేశాయి. 'లారీ డ్రైవర్', 'రౌడీ ఇన్‌స్పెక్టర్' నుంచి ఇండస్ట్రీ రికార్డులను తిరగరాసిన 'సమరసింహారెడ్డి', 'నరసింహనాయుడు' వరకు వీరి బాండ్ ఎంతో స్ట్రాంగ్. బాలయ్య బాడీ లాంగ్వేజ్‌కు తగ్గట్టుగా హై ఓల్టేజ్ యాక్షన్ సీన్లను డిజైన్ చేయడంలో గోపాల్ దిట్ట. అయితే 'పల్నాటి బ్రహ్మనాయుడు' పరాజయం పాలవ్వడంపై ఆయన ఇప్పటికీ బాధపడుతుంటారు. అయినప్పటికీ బాలయ్యతో ఆయనకున్న అనుబంధం విడదీయలేనిది.

మరోవైపు సూపర్ స్టార్ మహేష్ బాబుతో బి.గోపాల్ 'వంశీ' అనే సినిమా చేశారు. బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా ఆశించిన విజయం సాధించకపోయినా, మహేష్ వ్యక్తిగత జీవితంలో ఇది చాలా ప్రత్యేకం. ఈ సినిమా షూటింగ్ సమయంలోనే హీరోయిన్ నమ్రతా శిరోద్కర్, మహేష్ మధ్య ప్రేమ చిగురించింది. అది కాస్తా పెళ్లి వరకు వెళ్లి నేడు వారు ఒక అద్భుతమైన జంటగా నిలిచారు. మహేష్ కెరీర్‌లో ఈ సినిమా ఒక ముఖ్యమైన మలుపు అని చెప్పవచ్చు. ఈ సినిమా తర్వాత మళ్ళీ గోపాల్‌తో మహేష్ పనిచేయలేదు.

మిస్సయిన మల్టీస్టారర్

బాలయ్య, మహేష్ బాబు.. ఈ ఇద్దరు స్టార్లతో ఒకే సినిమాలో మల్టీస్టారర్ ప్లాన్ చేశారు బి.గోపాల్. అన్నదమ్ముల మధ్య ఉండే సెంటిమెంట్, దానికి తోడు పవర్ ఫుల్ యాక్షన్ ఎలిమెంట్స్‌తో ఒక అద్భుతమైన కథను సిద్ధం చేసుకున్నారట. బాలయ్య అన్నగా, మహేష్ బాబు తమ్ముడిగా నటిస్తే థియేటర్లలో పూనకాలు రావడం ఖాయమని ఆయన నమ్మారు. దీని కోసం ఎంతో ప్రయత్నించినప్పటికీ, కొన్ని కారణాల వల్ల ఆ కాంబినేషన్ సెట్ కాలేదు. ఒకవేళ ఈ సినిమా వచ్చి ఉంటే 'సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు' కంటే ముందే ఒక బిగ్గెస్ట్ మల్టీస్టారర్ రికార్డుల్లో నిలిచిపోయేది.

ప్రస్తుతం బాలయ్య బాబు వరుస విజయాలతో బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటుతున్నారు. 65 ఏళ్ల వయసులో కూడా కుర్ర హీరోలకు పోటీనిస్తూ బ్యాక్ టు బ్యాక్ హిట్లు అందుకుంటున్నారు. రీసెంట్‌గా వచ్చిన 'అఖండ' పర్వాలేదనిపించినా, ఆయన జోరు మాత్రం తగ్గలేదు. ఇక మహేష్ బాబు విషయానికి వస్తే.. రాజమౌళి దర్శకత్వంలో 'వారణాసి' అనే పాన్ వరల్డ్ సినిమాతో బిజీగా ఉన్నారు. రుద్ర అనే పవర్ ఫుల్ పాత్రలో మహేష్ నటిస్తుండగా, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తోంది. 2027లో రాబోతున్న ఈ సినిమాపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. బాలయ్య, మహేష్ బాబు ఒకే సినిమాలో కనిపిస్తే చూడాలని ఇప్పటికీ కోట్లాది మంది అభిమానులు కోరుకుంటున్నారు. బి.గోపాల్ కన్న ఆ కల ఎప్పటికైనా నిజమవుతుందో లేదో కాలమే నిర్ణయించాలి.





## అసలు రోజుకు ఎన్ని కప్పుల కాఫీ తాగాలి?

కాఫీని మితంగా తాగడం వల్ల శరీరానికి ఔషధంలా పనిచేస్తుంది. కాఫీలోని కెఫిన్ మెదడును ఉత్తేజపరుస్తుంది. మగతను దూరంగా ఉంచుతుంది. కాఫీని మితంగా తాగడం వల్ల గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుంది. కాఫీ కాలేయం నుంచి విషాన్ని బయటకు పంపి, కొవ్వు కాలేయ సమస్యను తగ్గిస్తుంది. కాఫీ శరీరంలో జీవక్రియ వేగాన్ని పెంచుతుంది. ఇది కొవ్వును కరిగించడంలో సహాయపడుతుంది. పరిశోధన ప్రకారం బ్లాక్ కాఫీ టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం రోజుకు 2 కప్పుల కాఫీ తాగడం సురక్షితం. ఆరోగ్యకరమైన వ్యక్తి రోజుకు 400 మిల్లీగ్రాముల కంటే ఎక్కువ కెఫిన్ తీసుకోకూడదు. ఒక కప్పు కాఫీలో దాదాపు 100 మిల్లీగ్రాముల కెఫిన్ ఉంటుంది. కాబట్టి ఒక రోజులో రెండు నుంచి మూడు కప్పుల కాఫీ తాగవచ్చు.

అయితే ఇందుకు భిన్నంగా రోజుకు 4-5 కప్పుల కంటే ఎక్కువ కాఫీ తాగితే అది తీవ్రమైన పరిణామాలను కలిగిస్తుంది. అధికంగా కాఫీ తాగడం వల్ల చేతులు, కాళు ్ళ నిరంతరం వణకడం లేదా చిరాకు వంటి సమస్యలను కలిగిస్తుంది. అలాగే కెఫిన్ రక్తపోటులో అకస్మాత్తుగా పెరుగుదలకు కారణమవుతుంది. దానితో పాటు, కాఫీ వల్ల కలిగే అతిపెద్ద సమస్య రాత్రి సమయానికి నిద్రపోలేకపోవడం. అలాగే కాఫీ కడుపు రుగ్మతలకు కారణమవుతుంది. ఎక్కువ కాఫీ పిత్తాన్ని పెంచుతుంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య కాఫీ తాగడం చాలా ప్రభావవంతంగా ఉంటుంది. కానీ సాయంత్రం 4 గంటల తర్వాత కాఫీ తాగకపోవడమే మంచిది. కాఫీలోని కెఫిన్ శరీరంలో 12 గంటలకు పైగా ఉంటుంది. మీరు ఒకవేళ సాయంత్రం సమయంలో కాఫీ తాగితే, అది రాత్రి నిద్రకు భంగం కలిగిస్తుంది. దీని వల్ల మీకు మరుసటి రోజు మొత్తం అలసిపోయినట్లు అనిపిస్తుంది.

గమనిక: ఇక్కడ అందించిన సమాచారం సాధారణ అవగాహన కోసం మాత్రమే. మేము వాటిని నిర్ధారించడం లేదు. అధిక సమాచారం కోసం వైద్య నిపుణుడిని సంప్రదించండి.



## రోజులో ఒక వ్యక్తి ఎంత నెయ్యి, నూనె తీసుకోవాలి?

నెయ్యి, నూనె లేకుండా భారతీయ ఆహారం అసంపూర్ణంగా భావిస్తారు. ఈ రెండూ భారతీయ ఆహారంలో అత్యంత ముఖ్యమైన భాగాలుగా పరిగణిస్తారు. భారతీయ వంటశాలలలో నెయ్యి, నూనె రెండూ మూడు భోజనాలలో ఉపయోగిస్తారు. ప్రతి ఇంట్లో వంట కోసం నూనెను ఉపయోగిస్తారు. రోటీ, కూరగాయలు, పప్పులకు కూడా నెయ్యిని కలుపుతారు. కొంతకాలం పాటు వాణిజ్య నెయ్యిని హానికరమని ప్రజలు భావిస్తారు. కానీ ఇంట్లో తయారుచేసిన దేశీ నెయ్యి చాలా ఆరోగ్యకరమైనదని ప్రజలు భావిస్తారు. దానిని వారి ఆహారంలో విస్తృతంగా ఉపయోగిస్తారు.గురుగ్రామ్‌లోని మేదాంత హాస్పిటల్‌లోని ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ డాక్టర్ ప్రవీణ్ చంద్ర ఇటీవలి ఇంటర్వ్యూలో, భారతీయులు ఎంత నెయ్యి, ఎంత నూనె తీసుకోవాలో వివరించారు. అలాగే గుండె ఆరోగ్యానికి మంచిదా కాదా అని కూడా వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన నెయ్యి, నూనె పరిమాణం గురించి చర్చించారు. సాధారణంగా భారతీయ సాంప్రదాయంలో నెయ్యి, నూనెలను ఎక్కువగా తీసుకుంటారని, పుట్టినరోజు, వివాహం లేదా ఒక కార్యక్రమాల్లో వీటి వాడకం ఎక్కువగా ఉంటుందన్నారు. గతంలో ప్రత్యేక సందర్భాలలో సంవత్సరానికి ఐదు నుండి ఆరు సార్లు మాత్రమే వేయించిన ఆహారాన్ని తినేవారు. ఇతర రోజులలో, ప్రజలు సాత్విక లేదా పచ్చి ఆహారాన్ని తినేవారు. నెయ్యి, నూనెలను ఎక్కువగా తీసుకోవడం వల్ల గుండె జబ్బులు పెరిగిపోయాయని అన్నారు.

నూనె, నెయ్యి గుండె ఆరోగ్యానికి మంచిదా?

దేశీ నెయ్యి, కూరగాయల నూనె మంచివని, కానీ అవి హైడ్రోజనేటెడ్ కాకపోతే మాత్రమే అని డాక్టర్ వివరించారు. ఏదైనా నూనెను హైడ్రోజనేషన్ చేయడం వల్ల ధాన్యంలా, తెల్లగా మారుతుంది. ఇది అనారోగ్యకరమైనది.

ఒక రోజులో ఒకరు ఎంత నెయ్యి తినవచ్చు?

డాక్టర్ ప్రవీణ్ చంద్ర ప్రకారం, మీరు రోజంతా 1 నుండి 2 టీస్పూన్ల నెయ్యిని తీసుకోవచ్చు. ఉదాహరణకు ఒక టీస్పూన్ నెయ్యి, ఒక టీస్పూన్ నూనె. కూరగాయల నూనెలు ఆరోగ్యకరమైనవిగా పరిగణిస్తారు. కానీ జంతువుల కొవ్వుతో తయారు చేసిన నూనెలు హానికరమైనవి. ఎందుకంటే అవి అధిక మొత్తంలో సంతృప్త కొవ్వును కలిగి ఉంటాయి. చెడు కొలెస్ట్రాల్‌ను పెంచే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయని తెలిపారు.

గుండెపోటు మరణ గణాంకాలు:

గుండెపోటు కేసులు పెరుగుతున్న రేటు చాలా ఆందోళనకరంగా ఉంది. 2022లో నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (చీజ=దీ) భారతదేశంలో గుండెపోటు మరణాలపై డేటాను నివేదించింది. 70 శాతం గుండెపోటు మరణాలు 30 -- 60 సంవత్సరాల మధ్య సంభవించాయని పేర్కొంది. 2022లో, 32,457 మరణాలు సంభవించాయని నివేదికలు చెబుతున్నాయి.

## పాక్ బుద్ధి మారదు..

అండర్-19 వరల్డ్ కప్ 2026లో భాగంగా భారత్ పాకిస్థాన్ జట్ల మధ్య జరిగిన హై వోల్టేజ్ మ్యాచ్‌లో ఒక అనూహ్య ఘటన చోటుచేసుకుంది. పాకిస్థాన్ మాజీ కెప్టెన్, ప్రస్తుత అండర్-19 జట్టు మెంటార్ సర్ఫరాజ్ అహ్మద్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. లైవ్ మ్యాచ్ జరుగుతుండగా డ్రెస్సింగ్ రూమ్ పరిసరాల్లో ఆయన మొబైల్ ఫోన్ వాడుతున్న ఫోటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఐసీసీ సీరియస్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

అండర్-19 ప్రపంచకప్ సూపర్-6 దశలో భారత్, పాకిస్థాన్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్ కేవలం ఆటపరంగానే కాకుండా, మైదానం వెలుపల జరిగిన కొన్ని పరిణామాల వల్ల కూడా వార్తల్లో నిలిచింది. పాక్ జట్టుకు మెంటార్‌గా ఉన్న సర్ఫరాజ్ అహ్మద్, మ్యాచ్ మధ్యలో మొబైల్ ఫోన్ వాడుతూ కెమెరా కంటికి చిక్కారు. అంతర్జాతీయ క్రికెట్ నిబంధనల ప్రకారం.. మ్యాచ్ జరుగుతున్న సమయంలో క్రీడాకారులు లేదా కోచింగ్ సిబ్బంది ఎవరూ కూడా కమ్యూనికేషన్ పరికరాలను (ఫోన్లు, ఐప్యాడ్లు) ఉపయోగించకూడదు. ఈ ఫోటో వైరల్ అవ్వడంతో అసలు సర్ఫరాజ్ కు ఫోన్ వాడే అనుమతి ఎవరు ఇచ్చారు? అంటూ నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు.

క్రికెట్‌లో అనే నిబంధన చాలా కఠినంగా ఉంటుంది. మైదానంలోని డ్రెస్సింగ్ రూమ్, డగౌట్, అంపైర్ల గదులు, భోజన ప్రాంతాలన్నీ ఈ పరిధిలోకి వస్తాయి. ఈ ప్రదేశాల్లోకి ప్రవేశించాలంటే ప్రత్యేకమైన అక్రిడిటేషన్ కార్డు ఉండాలి. ముఖ్యంగా అవినీతి నిరోధక శాఖ పర్యవేక్షణలో ఉండే ఈ ఏరియాలో మొబైల్ ఫోన్ల వాడకం పూర్తిగా నిషేధం. ఒకవేళ అత్యవసర పరిస్థితి ఉంటే, ఐసీసీ అధికారుల అనుమతితో మాత్రమే ల్యాండ్‌లైన్ ఉపయోగించాలి. సర్ఫరాజ్ అహ్మద్ నేరుగా మొబైల్ వాడుతూ కనిపించడం ఐసీసీ యాంటీ కరప్షన్ కోడ్ కింద నేరంగా పరిగణించబడే అవకాశం ఉంది.గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ఐసీసీ కఠిన చర్యలు తీసుకుంది. సర్ఫరాజ్ వంటి సీనియర్ ఆటగాడు ఇలాంటి తప్పు చేయడం ఇప్పుడు పాకిస్థాన్ క్రికెట్ బోర్డును ఇరకాటంలో నెట్టింది. కొందరు సోషల్ మీడియా యూజర్లు దీనిని మ్యాచ్ ఫిక్సింగ్ కోణంలో కూడా విమర్శిస్తున్నారు, అయితే అది నిరూపితం కాలేదు. కానీ, నిబంధనలను ఉల్లంఘించినందుకు గానూ సర్ఫరాజ్‌కు భారీ జరిమానా విధించడంతో పాటు, కొన్ని మ్యాచ్‌ల పాటు నిషేధం విధించే అవకాశం కూడా ఉంది. ఐసీసీ ఈ విషయంపై విచారణ చేపట్టినట్లు సమాచారం.



## వరల్డ్ కప్ లో అదిరిపోయే ట్విస్ట్.

ఫిబ్రవరి 7 నుంచి భారత్, శ్రీలంక వేదికలుగా ప్రారంభం కానున్న టీ20 ప్రపంచకప్ 2026కు ముందే క్రికెట్ ప్రపంచంలో పెను ప్రకంపనలు మొదలయ్యాయి. ఈ మెగా టోర్నీలో తమ జట్టు పాల్గొంటుందని ప్రకటించిన పాకిస్థాన్ ప్రభుత్వం, ఫిబ్రవరి 15న కొలంబోలో టీమిండియాతో జరగాల్సిన హై వోల్టేజ్ మ్యాచ్‌ను మాత్రం బాయ్‌కాట్ చేస్తున్నట్లు ప్రకటించి అందరినీ షాక్‌కు గురిచేసింది. ఈ నిర్ణయం వెనుక రాజకీయ కారణాలతో పాటు ఐసీసీపై నిరసన కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

టీ20 ప్రపంచకప్ 2026 ప్రారంభానికి కేవలం కొద్ది రోజుల ముందే పాకిస్థాన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం క్రికెట్ వర్గాల్లో వేడి పుట్టిస్తోంది. భారత కాలమానం ప్రకారం ఆదివారం మధ్యాహ్నం పాక్ ప్రభుత్వం అధికారికంగా ఒక ప్రకటన విడుదల చేసింది. దాని ప్రకారం.. పాకిస్థాన్ క్రికెట్ జట్టు శ్రీలంకలో జరిగే గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లన్నీ ఆడుతుంది కానీ, ఫిబ్రవరి 15న టీమిండియాతో జరిగే మ్యాచ్‌లో మాత్రం ఫీల్డ్‌లోకి అడుగుపెట్టదు. దీనికి ప్రధాన కారణం ఐసీసీ ఇటీవల తీసుకున్న ఒక నిర్ణయం. భద్రతా కారణాల దృష్ట్యా భారత్ లో తమ మ్యాచ్‌లు ఆడలేమని బంగ్లాదేశ్ మొండికేయగా, ఐసీసీ వారిని టోర్నీ నుంచి తొలగించి స్కాట్లాండ్‌ను చేర్చుకుంది. ఈ విషయంలో బంగ్లాదేశ్‌కు మద్దతుగా పాక్ ఈ బహిష్కరణ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

ఈ నిర్ణయం వల్ల పాకిస్థాన్‌కు భారీగా పాయింట్ల నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఐసీసీ నిబంధనల ప్రకారం.. ఒక జట్టు మ్యాచ్ ఆడటానికి నిరాకరిస్తే, ఆ మ్యాచ్‌ను ఓటమిగా పరిగణిస్తారు. తద్వారా భారత్‌కు కష్టపడకుండానే రెండు పాయింట్లు లభిస్తాయి. అయితే ఇక్కడ అసలు నష్టం పాయింట్ల కంటే ఆర్థికపరంగానే ఎక్కువగా ఉంటుంది. భారత్ పాక్ మ్యాచ్ అంటే ప్రపంచవ్యాప్తంగా వందల కోట్ల ఆదాయం వస్తుంది. బ్రాడ్‌కాస్టర్లు మరియు స్పాన్సర్లు ఈ ఒక్క మ్యాచ్ కోసమే కోట్లాది రూపాయలు కుమ్మరిస్తారు. పాక్ గనుక ఈ మ్యాచ్ ఆడకపోతే ఐసీసీకి దాదాపు 38 మిలియన్ డాలర్ల (సుమారు రూ.315 కోట్లు) మేర నష్టం వాటిల్లుతుందని అంచనా.

మరోవైపు, ఈ బహిష్కరణ వల్ల పాకిస్థాన్ క్రికెట్ బోర్డు కూడా తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి రావచ్చు. ఐసీసీ నుంచి వచ్చే వార్షిక ఆదాయ వాటాను నిలిపివేయడం లేదా భవిష్యత్తులో పాక్ వేదికగా జరిగే టోర్నీలపై నిషేధం విధించే అవకాశం ఉందని క్రీడా విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే పాక్ కెప్టెన్ సల్మాన్ ఆగా, బృందం శ్రీలంకకు బయలుదేరడానికి సిద్ధంగా ఉన్నారు. మరి చివరి నిమిషంలో ఐసీసీ మంతనాలు జరిపి పాక్ ప్రభుత్వాన్ని ఒప్పిస్తుందా? లేక ఈసారి భారత్-పాక్ మధ్య జరిగే మజాను ఫ్యాన్స్ మిస్ అవ్వాల్సిందేనా? అనేది వేచి చూడాలి.




Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com